క్లుప్తంగా

సాంబశివుని ఆలయంలో ప్రత్యేక పూజలు



మునగపాక సాంబశివుని సన్నిధిలో మాలలు ధరిస్తున్న శివభక్తులు

మునగపాక: స్థానిక సాంబశివుని ఆలయ సన్నిధిలో పలువురు భక్తులు శనివారం శివమాలలు ధరించారు. శివ నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. గురుస్వామి మాడెం జోగారావు ఆధ్వర్యంలో మాలలు ధరించిన భక్తులంతా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న అప్పలనాయుడు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మునగపాకకు చెందిన శ్రీచక్ర పాల్‌జీ బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు కోరారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులకు శనివారం ఆయన టీషర్టులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, వ్యాపారవేత్త ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మునగపాక: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి మునగపాక పోలీసులు పట్టుకున్నారు.అనుమతులు, రికార్డులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు దాడి చేసి, తిమ్మరాజుపేట వద్ద ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

నేడు కాశీ అన్నపూర్ణేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో కాశీ అన్నపూర్ణేశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త మళ్ల కాశీ మహేశ్వరరావు తెలిపారు.ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేతతో అవస్థలు

యలమంచిలి రూరల్: ముందుగా ప్రకటించకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో యలమంచిలి పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పెదపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పెదపల్లి ఫీడర్ పరిధిలో మాత్రమే నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా పెదపల్లి, వెంకటాపురం,పెద గొల్లలపాలెం,చిన గొల్లలపాలెం గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పట్టణంలో కూడా నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈవిషయమై ఏఈ కనకరాజును సంప్రదించగా అనుకోని విధంగా అత్యవసర మరమ్మతు పనులు చేయాల్సి రావడంతోనే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు.

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

ఆలయాల్లో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు



నామవరంలో స్వయంభూ రామలింగేశ్వర ఆలయం



రాయవరంలో శ్రీకృష్ణదేవరాయులు ప్రతిష్ఠించిన బుర్రేశ్వరస్వామివారు



ఉపమాకలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయం



నామవరంలో స్వయంభూగా వెలసిన రామలింగేశ్వర స్వామివారు

నక్కపల్లి: నియోజకవర్గంలో శైవక్షేత్రాలు కార్తీక శోభతో దేదీప్యమానంగా దర్శనమిస్తున్నాయి. కార్తీక మాస పూజలు ప్రారంభం కావడంతో అంతటా ఆధ్యాత్మిక కాంతులు వెల్లివిరిస్తున్నాయి. కార్తీక మాసం సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాయకరావుపేట,నక్కపల్లి,ఎస్.రాయవరం మండలాల్లో ప్రాచీన శైవక్షేత్రాలున్నాయి. ఈ ఆలయాల్లో స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. నెల రోజులూ మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, లక్షపత్రిపూజలు నిర్వహిస్తారు.

- పాయకరావుపేట మండలం నామవరంలో స్వయంభూరామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా రుద్రాభిషేకాలు, హోమాలు, చండీయాగం నిర్వహిస్తారు.చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వందల సంఖ్యలోభక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. గోపాలపట్నం సమీపంలో సీతమ్మవారిమెట్టపై గల ధర్మలింగేశ్వర స్వామి ఆలయం ప్రాచీనమైనది. తాండవనది ఒడ్డున ఉన్న కట్రాళ్లకొండపై పురాతన శివాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ కార్తీకమాసంలో శివభక్తులు, అయ్యప్ప భక్తులు మాలల ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- నక్కపల్లిమండలం ఉపమాకలో గల ప్రాచీన భువనేశ్వరి సమేతలక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన పుష్కరిణి బంధుర సరస్సుకు అభిముఖంగా ఈ శివాలయం ఉంది. సరస్సులో స్నానమాచరించిన భక్తులు పరమశివుడ్ని దర్శించుకుంటారు. ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయంతోపాటు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం, గొడిచర్లలో శేషలింగేశ్వరాలయం, చినదొడ్డిగల్లులో రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.
- ఎస్.రాయవరం గ్రామంలో శ్రీకష్ణదేవరాయలు ప్రతిష్ఠించిన బుర్రేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. పెద ఉప్పలంలో బలిచక్రవర్తి ప్రతిష్ఠించినబ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో ఏటా కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రశస్త్ యాప్



ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ జిల్లా సమన్వయకర్త శకుంతల

రాంబిల్లి(యలమంచిలి): దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి,వారి చదువుల తీరును విశ్లేషించి,అవసరమైన సహాయం చేయడానికే కేంద్ర ప్రభుత్వం ప్రశస్త్ యాప్‌ను ప్రవేశపెట్టిందని సమగ్రశిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు.

అనంతరం ప్రశస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల వివరాలను నమోదు చేయించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రశస్త్ యాప్ ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తించేలా కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్టు చెప్పారు. దీనిలో వివరాల ఆధారంగా దివ్యాంగ పిల్లలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి చర్యలు తీసుకోనున్నట్టు ఆమె తెలిపారు.కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జె.బుజ్జిబాబు, నాగరత్నం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవరుచుకోవాలి



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా వెంకటాపురంలో శనివారం అన్న సమారాధన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు భక్తులకు అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు తాతాజీ,మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు,ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వీఆర్వోల సంఘ రాష్ట్ర నాయకులు బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సాయివజ్రం, పాలసంఘ అధ్యక్షులు సుందరపు కాసులు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ధర్మ రక్షా దినోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

అచ్యుతాపురం: ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ ధర్మ రక్షా దినోత్సవాలు నిర్వహించనున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి. రమణ తెలిపారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభం అయినందున ప్రతి ఇల్లు ఒక దేవాలయంగా మారిందని తెలిపారు.ధర్మ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో ధర్మ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయాల్లో భజనలు,సామూహిక హారతులు,నగర సంకీర్తనలు నిర్వహించాలని కోరారు.ఈ సమావేశంలో కొల్లి అప్పారావు,గుడివాడ రమణ,సన్నిధి ఈశ్వరరావు,కోసూరి భాను ప్రకాశ్,కందుల భవానీ,కంఠంరెడ్డి ఆదిలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఎస్.రాయవరం: గోతులతో నిండిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో స్థానిక ఆటోయూనియన్ నాయకులు, డ్రైవర్లతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల మండలం అల్లుమియ్యపాలెం జంక్షన్ వరకు రహదారి దారుణంగా ఉందన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనిత, హోం మంత్రి అయిన తరువాత ఆ హామీని మరిచిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల బాధ్యులు ఎం.సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్,సీహెచ్ అప్పారావు, బి.నరేంద్ర, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ



అయ్యప్ప అంబలం పూజకు తరలివచ్చిన భక్తులు



ఆకట్టుకున్న అంబలం పూజ సెట్టింగ్

మునగపాక: స్థానిక నందీశ్వర ప్రాంగణంలో అయ్యప్ప స్వామి అంబలం పూజను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.అయ్యప్ప నామస్మరణతో మునగపాక మార్మోగింది. మాలలు ధరించిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. వేదపండితులు కోటేశ్వర శర్మ నేతృత్వంలో ఆలపించిన పలు గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సెట్టింగ్ అలరించింది.అంబలం పూజను తిలకించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాయకరావుపేట: మండలంలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు వీలుగా సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ధనిశెట్టి నగర్, షీలానగర్, పండరీపురం, ఇందిరాకాలనీ, లింగాల కాలనీ, దుర్గానగర్, దుర్గాకాలనీ, శాంతినగర్, అంబేడ్కర్ కాలనీ, శబరికాలనీ, రాజీవ్‌కాలనీ, జగనన్న కాలనీ, పీఎల్.పురం -1 అండ్ 2, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి



పారిశుధ్య డ్రైవ్‌లో పాల్గొన్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, సిబ్బంది

కోటవురట్ల: పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. బి.కె.పల్లిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. మెయిన్‌రోడ్డు, సంపద తయారీ కేంద్రం వద్ద డ్రైవ్ చేపట్టి ప్లాస్టిక్ కవర్లు, చెత్తను తొలగించడంతో పాటు స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగన్నాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం మండల సమావేశం రేపు

ఎస్.రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య ప్రత్యేక సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జి.సత్యనారాయణ తెలిపారు.ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

నైపుణ్య గణనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఇంటింటా నైపుణ్య గణన చేయాలని, 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తుల్లో నైపుణ్యాల గుర్తించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. యాప్‌లో నమోదు, సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ నైపుణ్యం ఉన్నవారిని గుర్తించి, పలు రకాల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

భూలోకమాంబకు కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

యలమంచిలి రూరల్: భూలోకమాంబ అమ్మవారికి మహిళలు శనివారం కుంకుమ పూజలు చేశారు.పట్టణంలోని తులసీనగర్‌లో కొలువుతీరిన భూలోకమాంబ అమ్మవారికి దీపావళి నుంచి నాగులచవితి వరకు విశేష పూజలు నిర్వహిస్తారు.ఐదు రోజులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా శనివారం అమ్మవారిని గాజులతో అలంకరించారు.పాతవీధి సుబ్రహ్మణ్యస్వామివారికి కూడా పంచామృతాభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఓ దాత స్వామివారికి వెండి కిరీటం బహూకరించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి బి.సరోజిని ఆధ్వర్యంలో సమాచారం హక్కు చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ పౌరులు సమాచార హక్కు చట్టం ద్వారా ఏ సమాచారం కోరినా 30 రోజుల్లో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. సెక్షన్ 4(1) ప్రకారం పౌరులు అడిగిన సమాచారానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టరులను నిర్వహించాలన్నారు. సెక్షన్ 8 (1) ప్రకారం దేశ భద్రత, సమగ్రత, వైజ్ఞానిక, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, హౌసింగ్ ఏఈ వరప్రసాద్, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల వద్ద జంగిల్ క్లియరెన్స్



డంపింగ్‌యార్డు వద్ద తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: మండలంలోని నక్కపల్లి,వేంపాడుల్లో డంపింగ్‌యార్డుల వద్ద శనివారం జంగిల్‌క్లియరెన్స్ చేపట్టారు. ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు యార్డుల ఆవరణలో పిచ్చిమొక్కలను, చెత్తను తొలగించారు. గ్రామాల నుంచి సేకరించిన తడి,పొడి చెత్తను షెడ్ల వద్ద నిర్మించిన కుండీల్లో వేశారు. ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ వర్మీకంపోస్టు, డంపింగ్‌యార్డులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ సర్పంచ్‌లు ఏడిద నూకరత్నం, రత్నకుమారి, ఉప సర్పంచ్‌లు అప్పలరాజు, వీసంరాజు, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం



మునగపాక రోడ్డుపై నిలిచిన వాహనాలు

మునగపాక: స్థానిక పూడిమడక రోడ్డుపై శనివారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మునగపాకలోని కృష్ణంరాజు కాలువ బ్రిడ్జిపై నుంచి నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శనివారం ఈ బ్రిడ్జిపై ఎదురెదురుగా వాహనాలు వచ్చేయడంతో ఇతర వాహనాలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమయంలో ఉద్యోగాలు, స్థానికులు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మూర్తి



పల్లపు ఆనందపురం సదస్సులో మాట్లాడుతున్న రీసర్వే డీటీ పడాల్

నక్కపల్లి: గ్రామసభల్లో స్వీకరించిన అర్జీలను సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. దోసలపాడులో శనివారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు.

అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే సందర్భంగా ఏమైనా తప్పులు దొర్లి ఉంటే సరిచేస్తామన్నారు. ఎంపీటీసీ పక్కుర్తి రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. రైతులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే సర్వేచేసి సరిహద్దులు నిర్ణయించి సమగ్రమైన రికార్డు తయారు చేసిందని చెప్పారు. ఇంత పెద్దకార్యక్రమం జరిగినప్పుడు అక్కడక్కడా కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చని వాటిని గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. డీటీ అన్నాజీరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన నాయకులు

మునగపాక: రెవెన్యూ అధికారుల తీరును శనివారం పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన జనసేన,బీజేపీ నేతలు తప్పుపడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అల్లవరపు రమణబాబు గతంలో గ్రామ కంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకోమని రెవెన్యూ అధికారులు చెప్పారని అయితే అదే అధికారులు నేడు ఇంటి నిర్మాణాలు ఆపేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని రీ-సర్వే డీటీ పడాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పడాల్ మాట్లాడుతూ సమస్యను తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందని, యూనియన్ బలపరచిన రఘువర్మను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎస్. ధర్మారావు కోరారు.అడ్డురోడ్డు తిమ్మాపురంలో శనివారం ఏపీటీఎఫ్ జిల్లాకార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ బలపరచిన పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు జి.సునీల్,కార్యదర్శి శ్రీనివాసరావు,జిల్లా కౌన్సిలర్ గోవిందరావు, కార్యవర్గ సభ్యులు జోగినాయుడు, బి.బాబూరావు, అప్పలరాజు,వీరభద్రరావు పాల్గొన్నారు.

టి.సిరసపల్లిలో స్వచ్ఛతా హీ సేవ



టి.సిరసపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



వాటర్ ట్యాంక్‌ని శుభ్రం చేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని టి.సిరసపల్లి సంపదతయారీ కేంద్రంతో పాటు గ్రామంలో పలు ప్రాంతాలను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

గ్రంథాలయంలో ..

అచ్యుతాపురం: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పరిసరాలను శుభ్రపరిచారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు.ప్రతి నెల మొదటి శనివారం గ్రంథాలయంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్టు కోటేశ్వరరావు తెలిపారు.